సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం ၊ 24 ၊ జనవరి ၊ 2024



సోమశిలలో 27.932 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 27.932 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువల ద్వారా 3,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.64,460
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,789
3శాతం జీఎస్టీతో	రూ.5,963
నవర (8గ్రా)	రూ.47,704

గరిష్టం/కనిష్టం
31.0 /23.5

వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 64 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి చేరుకున్నాయి. బుధవారం ఎలాంటి మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

ధ్రువీకరణ పత్రాల పరిశీలన



నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో పశుసంవర్ధక సహాయకుల పోస్టుల భర్తీకి సంబంధించి 34 మంది ధ్రువీకరణ పత్రాలను మంగళవారం పరిశీలించినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మహేశ్వరుడు తెలిపారు. నగరంలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేపట్టామని, మొత్తం 35 మంది రాగా, వారిలో ఒకరి సర్టిఫికెట్ మాత్రమే పెండింగ్ పడిందని, మిగిలిన 34 మంది ధ్రువీకరణ పత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. నివేదిక ఉన్నతాధికారులకు పంపామని, వారి నుంచి ఆదేశాలు వచ్చిన తరువాత నియామక ఉత్తర్వులు అందజేస్తామని తెలిపారు.

ఉత్తమ ఉద్యోగులకు బహుమతులు



కండక్టర్‌కు నగదు బహుమతి అందజేస్తున్న డిపో-1 మేనేజర్ మురళీకృష్ణ

నెల్లూరు సిటీ : నగరంలోని నెల్లూరు డిపో-1లో వివిధ విభాగాల్లో ఉత్తమ విధులు నిర్వహించిన ముగ్గురు కండక్టర్లు, ఇద్దరు ఉత్తమ డ్రైవర్లకు డిపో మేనేజర్ మురళీకృష్ణ నగదు బహుమతులు అందజేశారు. నగరంలోని నెల్లూరు డిపో-1లో మంగళవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కండక్టర్లు ఎస్‌బీ నిషాద్, జీజేఎస్ రెడ్డి, సి.శైలజ, డ్రైవర్లు కె.ప్రభాకర్, ఎస్.రమేష్‌లకు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ప్రతి నెలా ఉత్తమ విధులు నిర్వహించిన కండెక్టర్లు, డ్రైవర్‌లకు నగదు బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు.

పునరావాస కార్యక్రమాలు వేగవంతం చేయండి

• కలెక్టర్ హరినారాయణన్



నెల్లూరు(దర్గామిట్ట): రామాయపట్నం పోర్టు నిర్వాసితుల కోసం ఇంకా చేపట్టాల్సిన పునరావాస కార్యక్రమాలు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ పోర్టు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో పోర్టు ఎండీ ప్రతాప్‌రెడ్డి, కందుకూరు సబ్‌కలెక్టర్ విద్యాధరి, పోర్టు అధికారులతో పునరావాస కార్యక్రమాలు, భూసేకరణ, ఇండస్ట్రియల్ హబ్ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష చేశారు. మొదటి దశలో చేపట్టిన కార్యక్రమాలతో పాటు రెండో దశలో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికపై పోర్టు ఎండీతో చర్చించారు. ఇంకా చేపట్టాల్సిన పునరావాస కార్యక్రమాలపై తగిన చర్యలు తీసుకోవాలని ఎండీ ప్రతాప్‌రెడ్డిని ఆదేశించారు. సమావేశంలో మేరీటైం బోర్డు అధికారులు ఐవీరెడ్డి, పద్మావతి, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

ఒత్తిడి దూరం చేసుకుంటే మంచి ఫలితాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న దేవానంద్‌రెడ్డి

ఉలవపాడు: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడి దూరం చేసుకుంటే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తారని ప్రభుత్వ పరీక్షల విభాగం అడిషనల్ డైరెక్టర్ దేవానంద్‌రెడ్డి అన్నారు. ఉలవపాడులోని సాయి హైస్కూల్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. చదివిన విషయాన్ని నోట్సుల్లో రాయాలని, ఈ సమయంలో ఒత్తిడికి గురి కాకూడదని సూచించారు. ఉపసంహరణ, మైండ్ మ్యాపింగ్ అనేది చాలా ముఖ్యమని తెలిపారు. చదువుకున్న విషయాలను ఎలా గుర్తించుకోవాలనే అంశంపై వివరించారు. విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యే సమయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పరీక్షలంటే భయం వద్దని, ఇచ్చిన సమయంలోపు అన్ని ప్రశ్నలకు జవాబులు రాసేలా తర్ఫీదు ఇవ్వాలని చెప్పారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, కరస్పాండెంట్ వెంకటశేషమ్మ, ప్రిన్సిపల్ మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధికి రాచమార్గం

ఒకప్పుడు ఆ మార్గంలో ప్రయాణించాలంటే ప్రజలు నానా అవస్థలు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ప్రాంత అభివృద్ధిలో భాగంగా జాతీయ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో 60 శాతానికి పైగా మొదటి దశ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం రెండో దశ పనులు కూడా ప్రారంభమై శరవేగంగా జరుగుతున్నాయి. ఈ జాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల రహదారులు అనుసంధానమై ప్రయాణం మరింత సులువు కానుంది.





కావలి-దుత్తలూరు మార్గంలో కొంతమేర పూర్తయిన తారురోడ్డు పనులు

ఏళ్ల కల సాకారం దిశగా అడుగులు

- శరవేగంగా కావలి – సీతారామపురం జాతీయ రహదారి పనులు
- త్వరలో నెరవేరనున్న కావలి, ఉదయగిరి ప్రజల కల
- అనుసంధానం కానున్న మూడు జిల్లాల రహదారులు
- నిర్మాణం పూర్తయితే ప్రయాణం మరింత సౌకర్యవంతం

ఉదయగిరి : కావలి-సీతారామపురం జాతీయ రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కావలి-ఉదయగిరి నియోజకవర్గాలను కలుపుతూ రాయలసీమ జిల్లాలను అనుసంధానం చేసే అతి ముఖ్యమైన మార్గమిది. ఈ రోడ్డు నిర్మాణం దశాబ్దాలుగా మెట్ట ప్రాంతవాసుల కల. గత పాలకులు దీనిని పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక హైవే పనులపై శ్రద్ధ పెట్టింది. ప్రభుత్వం తీసుకున్న చొరవతో ప్రస్తుతం హైవే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మొదటి దశ పనులు ఈ ఏడాది ఆగస్టుకు పూర్తి కానుండగా, రెండో దశ పనులు మరో 18 నెలల్లో పూర్తికానున్నాయి. ఈ హైవే పనులు పూర్తయితే నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులు పూర్తిగా మారనున్నాయి. హైవే పనులు ప్రారంభం కావడంతోనే ఈ మార్గంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి.

60 శాతం పనులు పూర్తి

కావలి-సీతారామపురం జాతీయ రహదారి పనులను రెండు దశలుగా విభజించారు. మొదటి దశలో కావలి నుంచి దుత్తలూరు వరకు 64.9. కి.మీ. మేర రోడ్డును అభివృద్ధి చేసే దిశగా పనులు ప్రారంభించి 60 శాతం మేర పూర్తి చేశారు. ఈ హైవే పనులు ఈ ఏడాది ఆగస్టు నాటికి పూర్తి కానున్నాయి. ఇందు కోసం ప్రభుత్వం రూ.400 కోట్లు కేటాయించింది. రెండో దశలో దుత్తలూరు నుంచి సీతారామపురం వరకు 38.5. కి.మీ. మేర రోడ్డు అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులు ఈ నెలలో ప్రారంభమై చకచకా జరుగుతున్నాయి. ఈ పనుల కోసం రూ.360 కోట్లు కేటాయించారు. 18 నెలల్లో రెండో దశ పనులు పూర్తిచేసేలా కాంట్రాక్టర్ అగ్రిమెంటు చేసుకున్నారు. అగ్రిమెంటు కాలం లోపు పనులు పూర్తయ్యేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ పనులు పురోగతిపై దృష్టిపెట్టారు.



చకచకా జరుగుతున్న వంతెన నిర్మాణం

పల్లెలు మరింత అభివృద్ధి

మొత్తం 103.4 కి.మీ. పొడవున్న కావలి-సీతారామపురం మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ జాతీయ రహదారి పనులు పూర్తయితే కావలి పట్టణంతోపాటు ఉదయగిరి నియోజకవర్గంలోని జలదంకి, కలిగిరి, వింజమూరు, దుత్తలూరు, ఉదయగిరి, సీతారామపురం మండలాల్లోని గ్రామాలు మరింత అభివృద్ధి చెందనున్నాయి. ఈ రోడ్డును 14 మీటర్ల వెడల్పున విస్తరించనున్నారు. 10 మీటర్లు తారురోడ్డు వేయడంతోపాటు ఇరువైపులా 4 మీటర్లు అదనంగా రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు.

భూముల ధరలకు రెక్కలు

కావలి-సీతారామపురం హైవే పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో ఈ మార్గంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఒకప్పుడు ఈ ప్రాంతంలో భూములు కొనేందుకు ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు. కానీ ఇప్పుడు జాతీయ రహదారి వెంబడి అధిక ధరలు చెల్లించి వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు భూములు కొనుగోలు చేస్తున్నారు. జాతీయ రహదారి వెంబడి ఆయా ప్రాంతాలను బట్టి ఎకరా రూ.20 లక్షల నుంచి రూ.4 కోట్ల వరకు ధరలు పలుకుతున్నాయి. ఈ హైవే మార్గంలోని కలిగిరి, వింజమూరు, దుత్తలూరు, ఉదయగిరి ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారులు లేఅవుట్లు వేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి.

దుత్తలూరు-ఉదయగిరి మధ్య శరవేగంగా జరుగుతున్న హైవే పనులు



తొలి దశ పనులు :			రెండో దశ పనులు :
కావలి నుంచి దుత్తలూరు వరకు	విడుదల చేసిన నిధులు : రూ.400 కోట్లు ఈ రహదారి దూరం : 64.9 కి.మీ.	కేటాయించిన నిధులు : రూ.360 కోట్లు ఈ హైవే దూరం : 38.5 కి.మీ.	దుత్తలూరు నుంచి సీతారామపురం వరకు

మూడు జిల్లాల అనుసంధానం

రామాయపట్నం పోర్టు పనులు పూర్తయిన తర్వాత ఈ మార్గంలో రాకపోకలు పెరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్, ప్రకాశం జిల్లాల మధ్య అంతర్గత మార్గాలను కలిపేలా కావలి-సీతారామపురం రోడ్డును విస్తరిస్తున్నారు. దీని వల్ల పోర్టు నుంచి వచ్చే సరుకులను కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ పట్టణాలకు సులువుగా తక్కువ వ్యయంతో చేరవేసే అవకాశం కలుగుతుంది.

ఫలించిన కృషి

ఈ రహదారిని విస్తరించాలని గతంలో ఎంపీగా ఉన్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కానీ వైఎస్సార్ అకాల మరణంతో ఈ ప్రతిపాదన ఆగిపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాయలసీమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రత్యేక శ్రద్ధతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు, ప్రకాశం, రాయలసీమ ప్రాంతాలను అనుసంధానం చేసేలా జాతీయ రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మరో ఏడాదిలో కావలి-సీతారామపురం జాతీయ రహదారితోపాటు సింగరాయకొండ – మైదుకూరు హైవే 167బీ పనులు కూడా పూర్తికానున్నాయి.

ఏళ్ల కల నెరవేరనుంది



జాతీయ రహదారి నిర్మాణం కోసం ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్నారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన వెంటనే కావలి-సీతారామపురం జాతీయ రహదారి అభివృద్ధికి నిధులు కేటాయించారు. ప్రస్తుతం ఈ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. నిర్మాణం పూర్తయితే ప్రయాణం చాలా సులువవుతుంది.

– సుభాని, వ్యాపారి, దాసరపల్లి

మెరుగుపడుతున్న జీవన ప్రమాణాలు



జాతీయ రహదారి పనులు ప్రారంభం కావడంతో ఈ ప్రాంతంలో భూముల ధరలు బాగా పెరిగాయి. ఒకప్పుడు ఈ రోడ్డు మార్గంలో రూ.లక్ష కూడా విలువ చేయని ఎకరా భూమి ధర ప్రస్తుతం రూ.కోట్లలో పలుకుతుండడంతో రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి.

– బోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రైతు, బసిరెడ్డిపాళెం

వేగంగా రహదారి పనులు

కావలి-సీతారామపురం హైవే నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. కావలి నుంచి దుత్తలూరు వరకు మొదటి దశ పనులు ఈ ఏడాది ఆగస్టుకు పూర్తవుతాయి. రెండో దశ పనులు ఈ నెలలో ప్రారంభమయ్యాయి. మరో 18 నెలల్లో పూర్తవుతాయి. సకాలంలో పనులు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– అనిల్‌కుమార్‌రెడ్డి, డీఈ, నేషనల్ హైవే

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

- వైఎస్సార్ ఆసరా 4వ విడత నగదు జమ చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- జిల్లాలో నాలుగు విడతల్లో రూ.1074.39 కోట్లు అందజేత
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నగదు నమూనా చెక్కును పొదుపు మహిళలకు అందజేస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జేసీ కూర్మనాథ్, మేయర్ స్రవంతి

నెల్లూరు(దర్గామిట్ట): మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా పొదుపు మహిళల రుణమాఫీ నగదును నాలుగు విడతల్లో విజయవంతంగా విడుదల చేశారని, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నిధులను పొదుపు మహిళల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి వర్చువల్‌గా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నగర మేయర్ స్రవంతి, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు సాంబశివారెడ్డి, రవీంద్ర, పొదుపు మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి 7.98 లక్షల పొదుపు సంఘాల్లోని 78.94 లక్షల మంది అక్కచెల్లెమ్మలు చెల్లించాల్సిన రూ.25,271 కోట్ల రుణ మొత్తాన్ని నాలుగు విడతల్లో చెల్లిస్తానని హామీ ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో నిధులు విడుదల చేసి మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. ఈ మేరకు జిల్లాలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా నగదును 3,29,846 మంది పొదుపు సభ్యులకు రూ.270.54 కోట్లు ముఖ్యమంత్రి విడుదల చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో నాలుగు విడతల్లో 34,443 పొదుపు సంఘాల్లోని 3,29,846 మహిళలకు రూ.1074.39 కోట్లను జమ చేసినట్లు తెలిపారు. ఎవరి ప్రమేయం లేకుండా, ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా నేరుగా పొదుపు మహిళల ఖాతాల్లోనే ఈ నగదు జమ చేస్తున్నామన్నారు. ఇంత పెద్ద మొత్తంలో ఒక పథకానికి నిధులు కేటాయించడం గతంలో ఎన్నడూ జరగలేదని తెలిపారు. మహిళలందరూ ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధిసాధించాలన్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగనన్న



మొత్తం రుణమాఫీ చేస్తానంటే నమ్మబుద్ధి కాలేదు. కానీ ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో మా గ్రూపునకు సంబంధించిన రుణాన్ని పూర్తిగా చెల్లించారు. ఒక్కొక్క సభ్యురాలికి రూ.62,500 రుణమాఫీ డబ్బులు పడ్డాయి. సంక్షేమ పథకాలతో మా కుటుంబాలు ఆనందంగా జీవిస్తున్నాయి. మహిళలకు అండగా నిలుస్తున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– శ్రీదేవి, శ్రీదుర్గా గ్రూపు, నెల్లూరు

మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలి



మా తొమ్మిది గ్రూపులకు సంబంధించి ఒక్కొక్క గ్రూపునకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.1.68 లక్షలు జమయ్యాయి. ఇంత పెద్ద మొత్తం జమ కావడం ఊహించలేదు. పేదలకు, మహిళలకు ఏం కావాలో అన్నీ జగనన్న చేస్తున్నాడు. స్కూళ్లు బాగు చేయడంతో విద్యార్థులు బాగా చదువుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉంటున్నారు. అందరికీ మంచి చేస్తున్న జగనన్న మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నా.

– బి.పద్మ, సమాఖ్య అధ్యక్షురాలు, నెల్లూరు

స్వశక్తితో జీవిస్తున్నాం



జగనన్న ప్రవేశపెట్టిన వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ, అమ్మఒడి వంటి అనేక పథకాలతో మహిళలు స్వశక్తితో జీవిస్తున్నారు. నేను వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాల ద్వారా అందిన డబ్బులతో కిరాణా షాపు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాను. నాకు వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.52 వేలు డబ్బులు వచ్చాయి. అప్పులు చేయకుండా వ్యాపారం చేసుకుంటూ సంతోషంగా ఉన్నాను.

– బి.సుమతి, బుజబుజనెల్లూరు

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

• హాజరుకానున్న 12 వేల మంది విద్యార్థులు

నెల్లూరు(టౌన్): ఎన్‌ఐటీ, ఐఐటీలో ప్రవేశం కోసం నిర్వహించనున్న జేఈఈ మెయిన్స్ తొలి విడత పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు వచ్చే నెల 1వ తేదీ వరకు జరగనున్నాయి. తొలిరోజు బీటెక్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) పరీక్ష జరగనుంది. ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 12 వేల మందికి పైగా విద్యార్థులు హాజరుకానున్నారు. తొలి పరీక్ష బుచ్చిరెడ్డిపాళెంలోని అయాన్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. మిగిలిన పరీక్షలు జిల్లాలోని మూడు నుంచి నాలుగు సెంటర్లలో జరగనున్నట్లు సమాచారం. జేఈఈ మెయిన్స్ పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు విడతల్లో నిర్వహించనున్నారు. విద్యార్థులను ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఆయా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు అడ్మిట్ కార్డుతోపాటు ఏదో ఒక గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకెళ్లాల్సి ఉంది. పరీక్ష సమయానికి 2 గంటల ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని జేఈఈ మెయిన్స్ నిర్వాహకులు తెలిపారు.

సమష్టి కృషితో జిల్లా ప్రగతి

• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): జిల్లాను అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నిలిపేందుకు అధికారులందరూ సమష్టిగా కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో మంగళవారం జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. జెడ్పీ సీఈఓ చిరంజీవితో కలిసి జెడ్పీ సభ్యుల సమక్షంలో వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. రానున్న వేసవిలో మంచినీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, జల్‌జీవన్ మిషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. జగనన్న కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రభుత్వం వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ పథకం ద్వారా జిల్లాలోని రైతులకు రూ.1,474.69 కోట్లు అందజేసినట్లు తెలిపారు. స్వయం సహాయక గ్రూపు మహిళల కోసం 2022–23 ఆర్థిక సంవత్సరంలో 26,856 గ్రూపులకు రూ.1,259.35 కోట్లు, 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 26,723 గ్రూపులకు రూ.1,176.37 కోట్లు బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 340 సచివాలయ భవన నిర్మాణాలు పూర్తయ్యాయని, 252 ఆర్బీకేలు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు, బల్క్‌మిల్క్ సెంటర్ల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీలో వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మత్స్యకారులకు అందిస్తున్న సబ్సిడీ బోట్లను వారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ సమావేశాల్లో వివిధ శాఖల అధికారులు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సెబ్ ఏఈఎస్ గుంటూరుకు బదిలీ

నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)లో పనిచేస్తున్న పలువురు ఏఈఎస్‌లను బదిలీ చేస్తూ ఆ విభాగం కమిషనర్ ఎం.రవిప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా నెల్లూరు ఏఈఎస్‌గా పనిచేస్తున్న ఎస్.కృష్ణకిశోర్‌రెడ్డి గుంటూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 110	బ్రాయిలర్
లేయర్ (లైవ్) : 85	స్కిన్‌లెస్ : 220
బ్రాయిలర్ చికెన్ : 200	లేయర్ చికెన్ : 145

ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల్లో తనిఖీలు



ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న ఇన్‌స్పెక్టర్లు పి.వెంకటనారాయణ, బి.కల్యాణరాజు, ఎం.బాజీ, ఎం.నాగేశ్వరమ్మ

- సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధం కావాలి
- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టులు, టోల్‌ప్లాజాల వద్ద నిరంతర తనిఖీలు నిర్వహించి మద్యం, నగదు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో మంగళవారం ఆయన నెలవారీ సమీక్షను నిర్వహించారు. జిల్లాలో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులు, ఆస్తి సంబంధిత నేరాలు, పోక్సో, రాబరీ, రోడ్డు ప్రమాదాల కేసుల గురించి సర్కిల్స్ వారీగా సమీక్షించారు. ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలు, కేసుల పెండెన్సీ తగ్గింపు చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్లాలన్నారు. గ్రామాలను సందర్శించి సభలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్లు, గత ఎన్నికల కేసుల్లోని నిందితులను బైండోవర్ చేసి వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. లైసెన్స్‌లు కలిగిన ఆయుధాలను డిపాజిట్ చేయించాలన్నారు. నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు పగలు, రాత్రి గస్తీని పెంచాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. స్పీడ్ ట్రయిల్ మానిటరింగ్ ద్వారా షీట్స్ ఉన్న నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ప్రసాద్, శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ప్రశంసలు

గత నెలల్లో కేసుల ఛేదన, నిందితుల అరెస్ట్, కేసుల పెండెన్సీ తగ్గింపు తదితరాల్లో ప్రతిభ చూపిన నెల్లూరు వేదాయపాళెం, సంతపేట, నవాబుపేట, ఎన్నికల సెల్, సెబ్, వెంకటాచలసత్రం ఇన్‌స్పెక్టర్లు పి.వెంకటనారాయణ, బి.కల్యాణరాజు, ఎం.బాజీ, ఎం.నాగేశ్వరమ్మ, హెచ్‌ఎస్ హుస్సేన్‌బాషా, బి.అంకమరావు, గత దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ బీవీవీ సుబ్బారావుతోపాటు జిల్లాలోని 15 మంది ఎస్సైలు, ఇద్దరు ఏఎస్‌ఐలు, నలుగురు హెడ్‌కానిస్టేబుల్స్, 12 మంది కానిస్టేబుల్స్, టైపిస్టులకు ఎస్పీ ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఫైరింగ్ సాధన

ఆమంచర్లలోని ఫైరింగ్ రేంజ్‌లో కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ, జేసీ, ఏఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఎస్సైలు ఫైరింగ్ సాధన చేశారు. ఇందులో ప్రతిభ చూపి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన కలిగిరి, పొదలకూరు, ఉదయగిరి సీఐలు ఎండీ ఫిరోజ్, ఆర్.రాంబాబు, వి.గిరిబాబును ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

పొంగూరు నారాయణ మాటలు హాస్యాస్పదం




ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్

- నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'గతంలో కాలువగట్లపై ఇళ్లకు మార్కింగ్ ఇప్పించిన వ్యక్తి మాజీ మంత్రి పొంగూరు నారాయణ. ఎన్నికలు సమీపిస్తుండటంతో సదరు వ్యక్తుల వద్దకు వెళ్లి సహాయం చేస్తానని ఆయన మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది' అంటూ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్ విమర్శించారు. నెల్లూరు నగరంలోని 8వ డివిజన్ ముంకుందాపురం, ఆర్‌కే నగర్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే మంగళవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ నారాయణ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నెల్లూరు నగర కార్పొరేషన్‌కు దేశంలో 180వ ర్యాంకు వచ్చిందన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత 60వ ర్యాంకుకు తీసుకొచ్చామన్నారు. దీనిని బట్టి కార్పొరేషన్‌ను ఎవరు అభివృద్ధి చేశారో అర్థమవుతుందన్నారు. గత ప్రభుత్వంలో వేసిన రోడ్లు కుంగిపోతే తాము వేయించామని గుర్తుచేశారు. నాలుగున్నరేళ్ల తర్వాత నారాయణ వచ్చి ప్రజలకు సేవ చేస్తానని చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. కోవిడ్ సమయంలో ఆయన ఆస్పత్రిని ప్రభుత్వానికి ఇవ్వలేదన్నారు. దీంతో స్వాధీనం చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అప్పుడు సగం మంది సిబ్బందిని ఇవ్వలేదని, అలాగే ప్రభుత్వాస్పత్రికి కూడా కొంత సిబ్బందిని ఏర్పాటు చేయలేదన్నారు. ఎన్నికలు పూర్తయితే నారాయణ ఎవరికీ కనిపించరన్నారు. కనీసం టీడీపీ కార్యకర్తలకు కష్టం వచ్చినా పట్టించుకోని వ్యక్తి గురించి ప్రజలందరూ ఆలోచించాలన్నారు. ఎన్నికల ముందు వచ్చి హడావుడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. అభివృద్ధి చేస్తే శాశ్వతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కామాక్షిదేవి, కిన్నెర ప్రేమ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.44
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.20

సంక్షేమ పథకాలను చూసి ఆశీర్వదించండి



రెండో వార్డులో సిమెంట్ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: 'దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. వాటిని చూసి వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి సీఎంను చేయాలి' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. విజయీభవ యాత్రలో భాగంగా మంగళవారం ఆత్మకూరు రెండో వార్డు వెంకట్రావుపల్లిలో ఆయన పర్యటించారు. స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రూ.21.87 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును విక్రమ్‌రెడ్డి ప్రారంభించారు. దర్గాలో ప్రార్థనలు నిర్వహించిన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పేదరికం తగ్గేందుకు సంక్షేమ పథకాలపై సుమారు రూ.3 లక్షల కోట్లను సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఖర్చు చేశారన్నారు. వలంటీర్లను అవమానించేలా మాట్లాడిన టీడీపీ నాయకులకు గుణపాఠం చెప్పాల్సిన బాధ్యత ప్రజలదేనన్నారు. ఏడీఎఫ్ ద్వారా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. నారంపేట ఇండస్ట్రియల్ పార్కులో 50 శాతం పరిశ్రమలు ఇతర ప్రాంతం వారితో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అదే క్రమంలో 50 శాతం చిన్న తరహా పరిశ్రమలు స్థానిక వ్యాపారులు, ఉత్సాహవంతులైన విద్యావంతులచే పెట్టించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, ఐవీ రమణారెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, యువత జిల్లా ప్రధాన కార్యదర్శి నోటి వినయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నాయకుల చేరిక



ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన నేతలు

కోవూరు: విడవలూరు మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వావిల రమణయ్య, కాటంగారు సోలమయ్య, నరసింహారావు, వావిలి కామేశ్వర్, మరో 50 మంది ఆ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరారు. రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ బుచ్చంగారి తిరుపతయ్య ఆధ్వర్యంలో నెల్లూరులోని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంలో మంగళవారం పార్టీలో చేరగా కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో నాయకులు నవీన్‌రెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, తుమ్మల లక్ష్మయ్య, రామిరెడ్డి విజయభానురెడ్డి, రామం జి జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

9 హుండీల్లోని కానుకల లెక్కింపు పూర్తి

అనుమసముద్రంపేట: మండల కేంద్రంలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో హుండీ కానుకల లెక్కింపు కొనసాగుతోంది. నాలుగు రోజుల క్రితం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా మంగళవారం నాటికి 9 హుండీల్లోని కానుకల లెక్కింపు పూర్తయినట్లు వక్ఫ్‌బోర్డు ఈఓ హుస్సేన్ తెలిపారు. వాటిల్లో రూ.1,15,12,953 నగదు, 15 గ్రాముల బంగారం, 5 కిలోల వెండి ఉన్నట్లు వెల్లడించారు. మరో 8 హుండీల్లోని కానుకలను లెక్కించాల్సి ఉందన్నారు. ఇందుకు నాలుగు రోజులు పడుతుందని ఆయన తెలిపారు. వచ్చిన మొత్తాన్ని బ్యాంకుకు తరలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దర్గా ఈఓ షేక్ షరీఫ్, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర కార్యాలయ సూపరింటెండెంట్లు ఇబ్రహీం, గౌస్‌మొహిద్దీన్, నెల్లూరు, ఒంగోలు ఇన్‌స్పెక్టర్లు ఖాదావన్, అహ్మద్‌బాషా, ఏఎస్‌పేట వీఆర్వోలు మీరావలీ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ కేసులో ఒకరికి జైలు

నెల్లూరు(లీగల్): మోటార్‌బైక్‌లు దొంగతనం చేశాడని నమోదైన కేసులో నెల్లూరు వనంతోపు సెంటర్ ప్రాంతానికి చెందిన రావు సూర్యనారాయణ అనే వ్యక్తికి శిక్ష పడింది. ఏడునెలల జైలుశిక్షతోపాటు రూ.1,000 జరిమానా విధిస్తూ ఐదో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి దేవిక మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. నెల్లూరు జెండావీధి ప్రాంతానికి చెందిన మురళీధర్ గౌతమ్‌సింగ్ 2023 సంవత్సరం జూన్ మూడో తేదీన సాయంత్రం 6 గంటల ప్రాంతంలో వేదాయపాళెంలోని వివేకా మెడికల్ షాపు వద్ద బైక్‌ను ఆపి మందులు కొనుగోలు చేశాడు. తిరిగి బైక్ వద్దకు రాగా అది కనిపించలేదు. దీంతో ఆయన మరుసటిరోజు నెల్లూరు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేసి అదే నెల 21వ తేదీన కొండాయపాళెం గేటు సెంటర్ వద్ద సూర్యనారాయణను అదుపులోకి తీసుకుని విచారించగా గౌతమ్‌సింగ్ బైక్‌తోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన మరో పది బైక్‌లు కూడా దొంగతనం చేసినట్లు తెలిపాడు. అతడి నుంచి 11 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై మేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ కల్పన కేసు వాదించారు.

ఎంఆర్‌ఆర్ కళాశాలలో సెమినార్ నేడు

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జంతుశాస్త్ర విభాగంలో జాతీయస్థాయి సెమినార్ జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్బలక్ష్మమ్మ, సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.నాగేంద్రప్రసాద్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 'బయోటెక్నాలజీ ఇన్ హెల్త్‌కేర్, అగ్రికల్చర్, ఇన్‌సెక్ట్స్ అండ్ ఇన్నోవేషన్' అనే అంశాలపై ఒకరోజు సెమినార్ జరుగుతుందన్నారు. వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొంటారని తెలియజేశారు.